# మధుర స్మృతులు

ఉదయం పదకొండే అయినా ఒంటిగంట అయినట్లుగా వుంది. సూర్యుడు పైనుండి తనకోపాన్ని కిందకి కురిపిస్తున్నాడు.

మే నెల, మామిడికాలం, అమ్మ పెట్టిన మామిడి బద్దలు, మామిడికాయ పప్పు, కమ్మటి పెరుగులోకి తియ్యటి మామిడి రసాలతో సుష్టుగా భోజనం చేసి ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంటువారిపై నమ్మకంలేని నేను మడతమంచం పెరటి చెట్ల నీడలో వేసుకని నడుం వాల్చాను.



—ప్రసన్న

ఎండంతా తమ రాజ్యం అనుకుంటూ కోతి గంతులు వేస్తున్న పిల్లల్ని మా నాన్నగారు కేకలు వెయ్యటంతో ఆటమాని, నేను పడుకున్నచోటుకి కొద్ది దూరంలో గుమిగూడారు పిల్లలంతా.

''సారా! ఈ ఓల్డు పాక్స్ బీచ్‌మే నహీ ఆయెగా తో'' పళ్ళు నూరుకున్నాడు నా సుపుత్రుడు విశాల్.

వాడు అన్నది అర్థంకాకపోయినా నవ్వారు పకపక పిల్లలంతా.

అప్పటికి అయిదు నిమిషాలనుండి దొంగాటలో వాడు దొంగ. రన్నింగ్‌లో వాడికి ఫస్టు వచ్చినా, ఇక్కడ చెట్లమధ్యలో వాడికి ఎవరూ అవుటు అవటం లేదు. మా నాన్నగారివల్ల ఆట ఆగిపోవడం వాడికి బాధ వచ్చింది. ఏమి ఆట ఆడాలి అనుకుంటూ...వారం రోజుల క్రితం మునసబుగారింట్లో పెళ్ళికి వేయించిన రికార్డింగ్ డాన్సు గుర్తుకివచ్చి అది ఆడాలని పిల్లలంతా ఏకగ్రీవంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. నాలుగు ఇటుకలను స్టేజీగా, ఒక కర్రను మైక్‌లా చేసుకుని ఆట మొదలు పెట్టారు. వారి ఆటలు చూస్తున్న నాకు నా చిన్ననాటి రోజులపై మళ్ళింది మనస్సు. నేను ఎనిమిదో తరగతి చదివే రోజులు. ఒంటిపూట స్కూలు కావడంతో ఇళ్ళకు వచ్చి భోజనాలుచేసి పిల్లలంతా మా దొడ్లో ఆడుకునే వాళ్ళం. ఆ వీధికంతా మా యిల్లే పెద్దది. మా అమ్మ రమణమ్మగారు ఓర్పుగలవారు కావటంతో పిల్లల్ని మాయింటికి తోలేసి పగటి నిద్ర తీసేవారు అందరూ.

మా వీధిలో వుండే రాజు, రంగ, గోపీ, రాములు గోళీలు ఆడేవారు. ఆ ఆట నేను ఆడితే మా నాన్నగారి చేత బెత్తం వీపుపై నాట్యం చేసేది. మా అన్నయ్య ఎప్పుడూ పుస్తకాలలో పుస్తకాల పురుగులాగ కాలక్షేపం చేసేవాడు. నాతో ఆడే మగపిల్లలు ఎవరూ లేనందున మా వీధిలో వుండే ఆడపిల్లలు అనసూయ, పార్వతి, వర్ధనం, రమ, సుజాత వీళ్ళందరూ నా దోస్తులు. నా ఆటలు వీరితోనే.

అందరిలోకీ రమ అందమైనది. ఆమెను తాకాలని అనిపిస్తూ వుండేది. మాకు దొంగాట కంటె అమ్మా, నాన్నల ఆటంటేనే ఇష్టం. మాలో నేనొక్కడినే మగ వాడ్ని. అంచేత నాన్న క్రెడిట్ నాకు దక్కేది అమ్మలు మాత్రం మారుతూ వుండేవారు. అమ్మ క్రెడిట్ కోసం రమ, వర్ధనం అస్తమానం పోట్లాడుకునే వారు. ఆరోజు వర్ధనం రాలేదు. రమకి అమ్మ పోస్టు ఇచ్చాము. ఇటుకని పిల్లాడిలా చేసుకుని, పాలు ఇస్తోంది రమ. ''రమా అన్నంపెట్టు'' అన్నాను మొగుడి హోదాలో నేను ఆమెను కన్నార్పకుండా చూస్తూ. ''ఈ పిల్లని చూస్తూ వుండు'' అంటూ పక్కకి తొలగిన పైటను సరిచేసుకోకుండా నా చేతికిచ్చింది ఇటుకని. దానిని అందుకునే నెపంతో ఆమె పాల భాగాన్ని చేత్తో తాకాను. చురుగ్గా నన్ను చూసి, పక్కకుపోయి ఒక ఆకులో మట్టిని పెట్టి తెచ్చింది రమ. భోజనం పూర్తి కాగానే ఆఫీసుకెళ్ళిపోయాను. రాత్రి అయ్యాక వచ్చాను. ఆఫీసు బట్టలు మార్చుకున్నాను. పిల్ల అప్పటికే నిద్రపోయింది.

రమ, నేను భోజనాలు చేసాము. రాత్రి పడుకోవాలిగా. మట్టిలో ఇద్దరము పక్క-పక్కనే పడుకున్నాము.

అప్పుడప్పుడు మా అమ్మని, నాన్నని గమనిస్తున్న నేను నాలోకజ్ఞానాన్ని ప్రదర్శిస్తూ రమని దగ్గరగా లాక్కున్నాను. ''అబ్బా! ఏమిటిప్పుడూ?'' (బహుశా వాళ్ళ అమ్మగారు అలాగే అంటారేమో) అనే డైలాగ్‌ని చెప్పింది రమ.

''పిల్లలు పడుకున్నారా?'' గుస గుసగా అన్నాను. "ప్రొద్దుటనుంచీ పిల్లలతో రెస్టు లేదు'' అంటూ నాకు దూరంగా జరిగింది రమ. ''పిల్లలు కాకపోతే మనం చేస్తామా అల్లరి!'' అంటూ ఆమెకి దగ్గరగా జరిగాను. ''పడుకోనివ్వండి'' అంటూనే తనూ నా దగ్గరగా వచ్చింది. మిగతా పోస్టుల్లో వున్న అమ్మాయిలంతా కళ్ళింత చేసుకుని మమ్మల్ని చూస్తున్నారు.

''నేను ఆడతాను'' అంటూ దూరం నుంచి అరుస్తూ, పరిగెత్తుతూ వస్తోంది వర్ధనం.'' నీ ''పర్వతం'' వస్తోంది చూడు అంటూ పైకి లేచింది రమ. ''నన్ను పర్వతం అంటావా?'' లావుగా, పొట్టిగా వున్న వర్ధనం వస్తూనే రమతో దెబ్బలాటకు దిగింది. ''నువ్వు అలాగేవున్నావు అంటే తప్పా?'' అంది రమ. ''దెబ్బలాటలు మాని ఆడతారా లేదా అన్నాను కోపంగా, ''రాత్రి''ని తెల్లారనియ్యకుండా వచ్చిన వర్ధనాన్ని లో లోపలే తిట్టుకుంటూ.

''నన్ను అమ్మని చేసాడు రవి'' అంది గొప్పగా రమ.'' అయితే నేం! ఇప్పటిదాకా నువ్వు అమ్మవి అయ్యావుగా, ఇప్పుడు నేను అంది వర్ధనం.

''ఏం కాదు, మొన్నంతా నువ్వే అయ్యావు. ఇవ్వాళ నేను అమ్మని'' అంటూ వాదనకి దిగింది రమ.

''ఏమిటర్రా! పోట్లాడుకుంటున్నారు. దీన్ని కూడా ఆడించండి'' అంటూ చెల్లాయి రాజీని తీసుకొచ్చారు మా అమ్మ.

''చూడత్తా? ఎప్పుడూ రమే అవుతోంది అమ్మ'' అంటూ ఫిర్యాదు చేసింది వర్ధనం.

''ఏం కాదు. మొన్న అది అయ్యింది.'' అంది రమ. వారి మాటలకు అమ్మ పక పకా నవ్వుతూ, ''పెళ్ళి అవగానే ఇద్దరూ అవుతారు అమ్మలు'' అంది.

ఆవిడతో మిగతా పిల్లలందరం శృతికల్పాం.

* * *

''ఏమిట్రా నీలోనువ్వే నవ్వుకుంటున్నావు?'' అంటూ రాజీ'' వచ్చి లేపింది.

ఎప్పుడు డాన్స్ మానేసారో పిల్లలు అక్కడ లేరు. రాజీ పక్కనే వున్న మా పిన్నిగారి అబ్బాయి శ్రీనుని చూసి, ''నువ్వు ఎప్పుడొచ్చావురా?'' అన్నాను.

''ఇప్పుడే! ఏమిటి పగటి కలలు కంటున్నావు?'' అన్నాడు.

''అవే కదా మనకి మిగిలినవి. అమ్మ వచ్చిందా?'' అడిగాను.

''నువ్వు ఏదో కరువు ప్రదేశం నుంచి వచ్చావని, పాకుండలు, అటుకులు పట్టుకుని మరీ వచ్చింది'' అన్నాడు వాడు.

''ఇంతలేటుగా చెప్పటమా, నడు, పదు'' అంటూ లోపలికి వచ్చాను.

మా పిల్లలు, అన్నయ్యగారి పిల్లలతోపాటు రమ ''పిల్లలు కూడ తిండి'' పై దండెత్తారు.

''అత్తయ్య'' అంటూ చెబుతూ పిల్లాడికి పైట తొలగించి పాలు ఇస్తున్న రమ నన్ను చూసి మాటలు ఆపి పైటని భుజాలు నిండుగా కప్పుకుంది.

మా శ్రీమతి అందించిన ప్లేటు అందుకుని, పిన్నితో కబుర్లలో పడ్డాను.